జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 22-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 171 పేజీలు: 8 వెల : రూ.7


## గంజాయి నియంత్రణకు.. ప్రత్యేక..

# టాస్క్‌ఫోర్స్



- ✻ పోలీసు జాగిలాలతో విస్తృతంగా తనిఖీ
- ✻ నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా
- ✻ మూడుచోట్ల ప్రధాన చెక్‌పోస్టులు
- ✻ మత్తు, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం
- ✻ సంకల్పం పేరిట అవగాహన
- ✻ గంజాయి తాగినా, అమ్మినా గట్టి చర్యలు
- ✻ మత్తు, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం
- ✻ వీటికి బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు
- ✻ జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి

శ్రీకాకుళం క్రైం, నవంబర్ 21 (వార్త):

**శ్రీకాకుళం జిల్లాను మత్తు, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణతో జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, పోలీస్ జాగిలాలతో విస్తృతంగా తనిఖీలు, నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా, సంకల్పం అనే పేరుతో అవగాహనా కార్యక్రమాలు. ప్రధాన చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.**





### సంకల్పం పేరిట అవగాహన

మాదక ద్రవ్యాలు వినియోగం వలన కలిగే అనర్థాలు, దుష్ప్రభావాల గురించి క్షేత్ర స్థాయిలో జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది వారి పరిధిలో ఉన్న పాఠశాలలు కళాశాలలు విద్యార్థిని విద్యార్థులకు గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు సంకల్పం పేరిట ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలను చైతన్యం కలిగించేందుకు గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలు వినియోగం వలన కలిగే అనర్థాలు పై యువత, ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు.

### దాడులు పెంచాం..

గంజాయి రవాణా దారులపై 2022 సంవత్సరంలో 10 కేసులు నమోదు చేసి, 26 మందిని అరెస్టు చేసి సుమారు 583.67 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. అలాగే 2023 సంవత్సరంలో 19 కేసులు నమోదు చేసి 65 మందిని అరెస్టు చేసి సుమారు 338.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. 2024 సంవత్సరంలో ఇప్పటివరకు 40 కేసులలో గంజాయి రవాణా దారులను 106 గురుని అరెస్టు చేసి 1250.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేవలం గత రెండు నెలల్లో ఇప్పటి వరకు 26 కేసులలో 63 ముద్దాయిలను అరెస్టు చేసి 885.43 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని చెప్పారు.

### గంజాయి తాగినా, అమ్మినా గట్టి చర్యలు


జిల్లాలో గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. గంజాయి వినియోగం, సేవించడం, క్రయ విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు యువత మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హితవు పలికారు.

### మూడు ప్రధాన చెక్ పోస్టులు

జిల్లా సరిహద్దుగా ఇచ్ఛాపురం పురుషోత్తపురం, పాతపట్నం, పైడి భీమవరం సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, అన్ని విభాగాల సమన్వయంతో స్థానిక పోలీసులతో అక్రమ రవాణాకు అవకాశం ఉన్న మార్గాల్లో ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టి, ఆర్టీసి బస్సులు, లారీలు, కార్లు, స్టేజి క్యారియర్, ఇతర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. విజిబుల్ పోలీసింగ్ అనే ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు వాహన తనిఖీలు నిర్వహించి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

### డ్రోన్ కెమెరాతో నిఘా

శ్రీకాకుళం పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా జిల్లాలో నిర్మాణుష్యమైన పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో గంజాయి వినియోగం రవాణా నియంత్రించుటకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో గంజాయి వినియోగం జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, నిశితమైన ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు, నదీ పరీవాహక ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జె.ఆర్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలో కోష్ట పంచాయతీలో గల పైడిపేట గ్రామంలో పసుపురెడ్డి నూకరాజు అనే వ్యక్తి తన ఇంటి వద్ద గంజాయి మొక్కను పెంచుతున్నరని సమాచారం మేరకు జేఆర్ పురం పోలీసులు రెవెన్యూ వారి సమక్షంలో మొక్కను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు.



### స్పెషల్ టాస్క్‌ఫోర్స్

గంజాయి మూలాలను కనిపెట్టేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు ఈ బృందాలు జిల్లాలో గంజాయి వినియోగం, క్రయ విక్రయాలు, అక్రమ రవాణా నిల్వలను గుర్తించేందుకు నిఘా ఉంచి నిరంతరం పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. పోలీసు జాగిలాలతో విస్తృతంగా తనిఖీలు. గంజాయి నిల్వలు గుర్తించేందుకు శ్రీకాకుళం టూ టౌన్, ఆమదాలవలస, సోంపేట, ఇచ్ఛాపురం పోలీసు స్టేషను పరిధిలో ఈ బృందాలు ప్రత్యేక దృష్టి పెట్టి, పోలీసు జాగిలాల సహాయంతో రైల్వే స్టేషను, ఆర్.టి.సి కాంప్లెక్స్, పార్సిల్ సర్వీసు, ట్రాన్స్ పోర్టు కార్యాలయాలు, కార్గో సర్వీసులు, గోడౌన్లు, లాడ్జిలలో ముమ్మర వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి క్రయ విక్రయాలు జరిగేందుకు అవకాశం ఉన్న అనుమానం ఉన్న ప్రాంతాలను క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నామని తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 25న కోటి దీపోత్సవం



**శ్రీకాకుళం టౌన్, నవంబరు 21(వార్త):** శ్రీకాకుళంలో ఈ నెల 25న కోటి దీపోత్సవం నిర్వహించనున్నారు. ఆంజనేయ ఆలయ కమిటీ అధ్యక్షుడు ముక్కాల కొండబాబు ఆధ్వర్యంలో పీఎస్ఎన్ఎం స్కూల్ వెనుక మైదానంలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక గ్యాలరీలతోపాటు అభిషేకం చేసేందుకు శివలింగాన్ని సిద్ధం చేస్తున్నారు.

# గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించాలి

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, నవంబర్ 21(వార్త):** ప్రణాళికాబద్ధంగా జిల్లాలో గృహ నిర్మాణ లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గృహ నిర్మాణశాఖ అధికారులకు స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖకు నిర్దేశించిన లక్ష్యాలు, ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు అనుగుణంగా జిల్లాలో 100 రోజుల వ్యవధిలో 5 వేల గృహాలు, ఏడాదిలోపు 35 వేల గృహాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి రూఫ్ లెవెల్ పూర్తయిన భవనాలను నూరు పూర్తి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు రుణాలు ఇప్పించి వాటిని నిర్మాణాల కోసం వినియోగించుకునేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ ద్వారా గృహ లబ్దిదారునికి 90 రోజుల పనిదినాలు కల్పించి వేతన లబ్ధి చేకూర్చాలన్నారు. హౌసింగ్ పీడీ బి నగేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పురోగతిని వివరించారు. సమీక్షలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పెండింగ్ రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

పెండింగ్ లో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ఆయన గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలు, ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికకు వచ్చే అర్జీలలో పెండింగ్ లో ఉన్న అర్జీలు, లోకాయుక్త, కోర్టు కేసులు, వాటర్ ట్యాక్స్, నాలా, రీ సర్వే, ఆర్ ఓ ఆర్, సివిల్ సప్లయ్స్, తదితర అంశాలపై ఆయన మండలాల వారీగా సమీక్షించారు. పెండింగులో ఉన్న రెవెన్యూ సమస్యలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాక్స్ అంతా పరిశీలించి ట్యాక్స్ వసూలు చేయాలని ఆదేశించారు. ట్యాక్స్ వసూలు చేసేందుకు సిబ్బంది అవసరం ఉంటే తెలియజేయజేస్తే డిజిటల్ అసిస్టెంట్ ను ఇస్తామన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు వెళితే సమస్యలు పరిష్కరించాల్సిన సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించవచ్చని తెలిపారు. ఉచిత ఇసుకపై సమస్యలు ఉంటే తక్షణమే ఆపాలన్నారు. ఎక్కడపడితే అక్కడ ఇసుక తీయడానికి అవకాశం లేదని విఆర్ఓ కు తెలియజేయాలని, వాటర్ సోర్సెస్ దగ్గర, వంతెనలు వద్ద, రాత్రి పూట తీయకూడదన్నారు. ఎన్.జి.టి. నిబంధనలు అతిక్రమించకూడదన్నారు. సీజ్ చేసిన ఇసుక ఎక్కడైనా ఉంటే తెలపాలని కలెక్టర్ చెప్పగా గార, ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లో ఉన్నట్లు తహసీల్దార్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాలు మరమ్మతులు ఉంటే తెలపాలని అడుగగా మరమ్మతులు ఉన్న తహసీల్దార్ కార్యాలయాలు అంచనా వ్యయం పంపాలని ఆదేశించారు. ఈ ఆఫీసు పై అందరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, ఉప కలెక్టర్లు పద్మావతి, లక్ష్మణమూర్తి, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ, సర్వే అండ్ లాండ్ రికార్డులు శాఖ సహాయ సంచాలకులు విజయ్ కుమార్, కలెక్టరేట్ ఆయా విభాగాల పర్యవేక్షులు సరోజని, సూర్యనారాయణ, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, తహసీల్దార్లు, డిటిలు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

**హిరమండలం,ఎల్ఎన్‌పేట నవంబర్ 21(వార్త):** శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి గురువారం హిరమండలం, సారవకోట, జలుమూరు పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా సందర్శించి పలు ముఖ్యమైన రికార్డులు నిర్వహణ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో హిరమండలం పోలీస్ స్టేషన్లో మహిళా పోలీసుల విధి విధానాలపై ఆరాతీశారు. ప్రతిరోజు గ్రామాల్లో సందర్శించి మహిళలపై జరుగుతున్న దాడులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సమాచార సేకరించి సంబంధిత పోలీసు అధికారులకు తెలపాలని ఎస్పీ సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు ఆరా తీసి ప్రతి కేసును త్వరితగతంగా దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ అధికారులు సిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో సందర్శించి సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు వలన కలిగే అనార్థాలు, రోడ్డు ప్రమాదాలు నివారణ భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమంలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నేర్పించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



## పార్టీ అభివృద్ధికి కష్టపడిన ప్రతిఒక్కరికి గుర్తింపు



### టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కలమట

**మెళియాపుట్టి నవంబర్ 21 (వార్త):** తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం అయ్యేందుకు కష్టపడి కృషిచేసి ప్రతి ఒక్కరికి పార్టీ గుర్తింపు ఇస్తుందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకాల్లో పాతపట్నం నియోజకవర్గం, మెళియాపుట్టి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్‌కు గౌడసంఘ రాష్ట్ర డైరెక్టర్‌గా స్థానం కల్పించడంతో మాతలలో గల కలమట క్యాంప్ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తికి భాస్కర్ గౌడ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలమట మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికి పార్టీ గుర్తింపు ఇస్తుందని, ప్రజలకు చేరువుగా ఉండి పార్టీ అభివృద్ధికి నిరంతరం మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలమటకు కలిసిన వారిలో భాస్కర్ గౌడ్ తో పాటు దేశం పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

## బెల్ట్ దుకాణాల్లేకుండా చూడండి

**నరసన్నపేట, నవంబర్21(వార్త):** గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి. శ్రీకాంత్‌రెడ్డి కోరారు. గురువారం నరసన్నపేట ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులకు త్వరగా చార్జిషీట్లు వేయాలని, రెండేళ్లలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన వారిపై బైండ్‌వర్ కేసులు పెట్టాలని కోరారు. మద్యం దుకాణాల్లో నిబంధనలు పాటించే విధంగా విస్తృత తనిఖీలు చేయాలన్నారు. గంజాయి అమ్మకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎన్‌పీఎల్ మద్యం రాకుండా వాహనాలను తనిఖీలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ రమణ, ఎస్ఐ గురుమూర్తి పాల్గొన్నారు.




## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

- సర్కిల్ ఇన్స్పెక్టర్ రామారావు
- కరజాడలో అవగాహన ర్యాలీ




**మెళియాపుట్టి, నవంబర్ 21 (వార్త):** మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యానికి హానికరమని అటువంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ రామారావు అన్నారు. మెళియాపుట్టి మండలం, కరజాడ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం పాతపట్నం సీఐ రామారావు నేతృత్వంలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆర్థికంగా, ఆరోగ్యకరంగా, సామాజిక పరంగా తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందని తద్వారా కుటుంబంలో సైతం కలహాలు ప్రారంభమై జీవితం చిన్నభిన్నమవుతుందని వీటిని దృష్టిలో పెట్టుకొని ఎవరు కూడా మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడవలసిన బాధ్యత సైతం మనపైనే ఉందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు సైతం మత్తు పదార్థాల వల్ల జరిగిన నష్టాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ తో పాటు ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## అగ్ని ప్రమాదాల నుంచి అడవులను రక్షించుకోవాలి



**మందస, నవంబరు 21(వార్త):** అగ్ని ప్రమాదాలతో అడవులకు నష్టం కలుగుతోందని, అడవులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము అన్నారు. మండలంలోని గిరిజన ప్రాంతాలైన బుడంబో, సాబకోట, భావనపురం, కారిగాం తదితర గ్రామాల్లో అడవుల్లో అగ్ని ప్రమాదాలు-నివారణ చర్యలుపై అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తరుచూ అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గిరిజనుల పొరపాట్లు కారణంగా కూడా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అడవుల్లో నిప్పు పెట్టరాదని సూచించారు. చెట్లుతో పచ్చదనం, ప్రకృతి పరిరక్షణ, మానవ జీవన మనుగడ సాగుతుందన్నారు. ఇప్పటికే చాలా వరకు నష్టం జరిగిందన్నారు. అడవులు సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమలో అటవీశాఖ ఎఫ్బీఓలు టి.వెంకటేశ్, భానుమూర్తి, దుర్గాదేవి, జోగారావు, లక్ష్మణమూర్తి, సురేష్, ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## దాడి చేశారని యువకుడి ఫిర్యాదు

**శ్రీకాకుళం, నవంబర్ 21 (వార్త):** ముగ్గురు వ్యక్తులు తనపై విచక్షణరహితంగా దాడి చేశారని డీసీసీబీ కాలనీకి చెందిన చింతపల్లి నవీన్ కుమార్ శ్రీకాకుళం రూరల్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాము తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**మందస, నవంబర్ 21(వార్త):** బొగాబంద ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ సంఫరాలో శుక్రవారం అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ జి.యగ్నేశ్వర రావు, మందస ఏఈ ఎల్.యోగి తెలిపారు. ఆ ఫీడర్ లైన్ పరిధిలో మరమ్మతులు చేపట్టడంతో పాటు చెట్ల కొమ్మలు తొలగిస్తామన్నారు. కిల్లోయి, బొగాబంద, చిన్న బరంపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

## విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

**వంగర, నవంబర్ 21(వార్త):** కాగితాపల్లి నుంచి వంగర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీ లైన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సాంబశివరావు, ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. ఈ లైన్‌కు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తామన్నారు. చిన రాజుల గుమ్మడ, రాజుల గుమ్మడ, వీవీఆర్ పేట, జేకే గుమ్మడ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

# ఫాసిజాన్ని అడ్డుకోవాలి




**కాశీబుగ్గ, నవంబర్ 21(వార్త):** దేశం ఫాసిస్ట్ ప్రమాదాన్ని ఎదుర్కొంటోందని, దీనిని అడ్డుకోవడం తక్షణ కర్తవ్యం అని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడులో గురువారం జరిగిన శ్రీకాకుళం అమరవీరుల 46వ స్మారక సభలో ఆయన మాట్లాడారు. మతోన్మాదాన్ని, విద్వేషాలను రెచ్చగొట్టడం, సంఘ పరివార్ అజెండాను మోదీ అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులను అణచివేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. మోదీ కార్పొరేట్ల ఏజెంట్లుగా మారి, సహజ వనరులన్నీ సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. శ్రీకాకుళ ఉద్యమ అమరవీరులకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సభకు ఇఫ్టూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి అధ్యక్షత వహించారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్, పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షుడు బతకల ఈశ్వరమ్మ, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు, సవర బంగ్లాకుమార్, మురిపిండి తాతారావు రాపాక చంద్రయ్య, మురిపిండి ఎరకమ్మ పాల్గొన్నారు.

# నెహ్రూ పార్క్‌లో సౌకర్యాలు కల్పించండి



**కాశీబుగ్గ, నవంబర్ 21(వార్త):** పలాసలోని నెహ్రూపార్క్‌లో సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావును వాకర్స్ క్లబ్ సభ్యులు కోరారు.

ఈ మేరకు వారు గురువారం ఆయనకు వినతిపత్రం అందించారు. పార్కులోని సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. పార్కులో సాయంత్రం పూట వాకింగ్ చేసుకోవడానికి వీలుగా లైటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. పార్క్‌కు ఆను కొని ఉన్న కేటీ రోడ్డు పక్కన అనేక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటుతో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది పడుతున్నామని, దీంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను అక్కడ తొలగించి వాకర్స్ వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ రామారావు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జి.రాజేంద్రనాయుడు, దడియాల నరసింహులు, లండ నాగరాజు, బి.శంకరరావు, ఎస్.వసంత్, సంతోష్ పాత్రో, బోనెల బైరాగి, సత్యనారాయణ పాల్గొన్నారు.

# అవగాహన లేకుండా మాట్లాడడం నర్తుకు తగదు



**జలుమూరు, నవంబర్ 21 (వార్త):** శాసనమండలిలో ఎమ్మెల్సీ నర్తు రామారావు అవగాహన లేకుండా మాట్లాడడం తగదని ఆదివాసీ రాష్ట్ర పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. ఆదివాసీలకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బెంతు ఒరియాలు బీసీ ఏ వర్గానికి చెందిన వారిని ప్రభుత్వమే ప్రకటించిందన్నారు. ఈ విషయం తెలుసుకోకుండా అవగాహనా రహిత్యంగా నర్తు శాసనమండలిలో మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. విశాఖలో ఉన్న గిరిజన సంస్కృతి,సంప్రదాయ పరిశోధన సంస్థ కార్యాలయానికి వెళ్లి అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఇదే వైఖరి కొనసాగిస్తే రాబోయే స్థానిక ఎన్నికల్లో పూర్తిగా వైఎస్సార్సీపీని ఓడిస్తామని హెచ్చరించారు. మరోసారి ఆదివాసీ మనోభావాలు దెబ్బ తీసే టట్టుగా ఎక్కడైనా మాట్లాడితే ఎమ్మెల్సీ ఇల్లు ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరి షత్ సభ్యులు జన్ని దాలయ్య, బొమ్మాలి కృష్ణ, బాలరాజు, నాగయ్య, రంగా రావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



# సారా కేంద్రాలపై దాడి

మందస, నవంబర్ 21(వార్త): కొండలోగాం పంచాయతీ చాపరాయి ప్రాం తంలో ఎక్సైజ్ శాఖాధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సోంపేట సీఐ కె.బేబి ఆధ్వర్యంలో ఎస్ఐ జాన్ ప్రసాద్, సిబ్బంది తనిఖీల్లో సారా తయారీకి వినియోగించే 700 లీటర్లు పులిసిన బెల్లం ఊటలు ధ్వంసం చేశారు. పిడిమందస పంచాయతీలోని సవరమధ్య గ్రామంలో 700 లీర్లు ధ్వంసం చేసి, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పలాస ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



## జగదీశ్వరరావుకు ఘన సన్మానం

**పలాస, నవంబర్ 21(వార్త):** యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పలాసకు చెందిన జగదీశ్వరరావును 31వ వార్డు ఇన్‌చార్జి శంకరరావు, లొడగల కామేశ్వరరావు, అంబటి కృష్ణమూర్తి, సప్ప మన్మథ, బద్రి గోపాల్, తిక్క ఢిల్లీ రావు తదితరులు గురువారం ఘనంగా సన్మానించారు.

## సిక్కోలు జానపద కళా జాతరకు వితరణ



**పలాస, నవంబర్ 21(వార్త):** సిక్కోలు జానపద కళా జాతరకు జెస్సీ ఈవెంట్ ఆర్గనైజర్ కిక్కర ఢిల్లీరావు రూ.5555లు తొలి విరాళంగా గురువారం అందజేశారు. ఈ జాతర జనవరి 12న జరగనుంది. ఆయనకు ఆ కళావేదిక సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## అపార్ కాని విద్యార్థుల వివరాల సేకరణ



**నరసన్నపేట, నవంబర్ 21(వార్త):** నరసన్నపేట మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గురువారం అపార్ నమోదు కాని విద్యార్థుల వివరాలను సమగ్ర శిక్షా సీఆర్ఎంటీ పి.లక్ష్మణరావు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినతేదీ సర్టిఫికెట్లు ఆధారంగా నమోదు చేసి అపార్ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సాయి శంకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన




**వంగర, నవంబర్ 21(వార్త):** వంగర బస్టాండ్ ఆవరణలో హౌసింగ్ ఏఈ పైడితల్లి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. విధి విధానాలను తెలియజేశారు. సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాన్ని సందర్శించిన ప్రత్యేకాధికారి

**నరసన్నపేట, నవంబర్ 21(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఆధార్ కేంద్రాన్ని గురువారం మండల ప్రత్యేకాధికారి అనురాధ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆధార్ వివరాల్లో తప్పులను వేగంగా సవరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సమగ్ర శిక్ష సీఆర్ఎంటీలు, పీటీ తారకేశ్వరరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శ్రీముఖలింగం జడ్పీ పాఠశాల వేళల మార్పు

**జలుమూరు, నవంబర్ 21(వార్త):** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమయ వేళలు మార్చామని ఇన్‌చార్జి హెచ్‌ఎం మోహన్‌దాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం జడ్పీ పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాల కొనసాగుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు.





## పాస్ పుస్తకాల్లో సవరణకు సహకరించండి

**నరసన్నపేట, నవంబర్ 21(వార్త):** సమగ్ర భూ సర్వేలో భాగంగా రైతులకు అందజేసిన పత్రాల్లో పలు సవరణలు చేపట్టాల్సి ఉందని తహసీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు. నరసన్నపేట మండలం నర్సింగరాయుడుపేటలో గురువారం గ్రామసభను నిర్వహించారు. సర్వేయర్ అప్పలస్వామి మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాలలో, భూ హక్కుల పత్రాల్లో సవరణకు గ్రామ సభలను నిర్వహిస్తున్నామని, రైతులు సహకరించాలన్నారు.

## కళింగ సామాజికవర్గ సంక్షేమానికి కృషి



**నరసన్నపేట, నవంబర్ 21 (వార్త):** పోలాకి మండలానికి చెందిన రోణంకి కృష్ణంనాయుడును రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. గురువారం ఆయనను తన స్వగృహంలో రాష్ట్ర కళింగ సంఘ అధ్యక్షుడు వెంకటరమణ, ఉత్తరాంధ్ర యూత్ ఇన్‌చార్జి అన్నెపు సంతోష్, రాష్ట్ర కార్యదర్శి నారాయణ తదితరులు కలిసి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళింగుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## నరసన్నపేట డంపింగ్‌యార్డ్‌లో మంటలు



**నరసన్నపేట, నవంబర్ 21 (వార్త):** నరసన్నపేటలోని డంపింగ్ యార్డ్‌కు గుర్తుతెలియని వ్యక్తులు మంట పెట్టారని ఈవో ద్రాక్షాయిని గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంట పెట్టారని తమకు సమాచారం వచ్చిన వెంటనే సిబ్బందితో వెళ్లి వాటర్ ట్యాంకర్లతో మంటలు అదుపు చేశామని తెలి పారు. మంట పెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

## సామూహిక సత్యనారాయణ వ్రతాలు



**నరసన్నపేట, నవంబర్ 21(వార్త):** నరసన్నపేటలోని చిత్రి వీధి వద్ద ఉన్న సత్యసాయి పెద్ద మందిరంలో గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. మందిర కన్వీనర్ వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సత్యసాయి 99వ జన్మదిన వేడుకలకు సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ప్రముఖ వేదపండితులు రవిశర్మ ఆధ్వర్యంలో వ్రతాలు నిర్వహించారు.

## ఎరువుల దుకాణం తనిఖీ

**నరసన్నపేట, నవంబర్ 21(వార్త):** ఫెర్టిలైజర్స్ షాపుల్లో క్రిమిసంహారక మందుల విక్రయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిణి సునీత తెలిపారు. గురువారం నరసన్నపేటలోని నాగార్జున ఫెర్టిలైజర్స్ షాపును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటలకు పట్టే పలు వ్యాధులకు సంబంధించి రైతులకు అవగాహనపరిచి క్రిమి సంహారక మందులను అందించాలని ఆమె ఆదేశించారు. ఈ మేరకు నమూనాలు సేకరించామని తెలిపారు.



# ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సన్నాహాలు

**మందస, నవంబర్ 21(వార్త):** పలాస నియోజకవర్గంలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు భూసేకరణ, క్షేత్రస్థాయి పరిశీలన, ఎయిర్ పోర్టు నిర్మాణానికి అనువైన ప్రాంతాలను అధికారులు పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా మందస మండలంలోని బిడిమి, భేతాళపురం, టి.గంగువాడ, వజ్రపుకొత్తూరు మండలంలోని చీపురుపల్లి, మెట్టూరు ప్రాంతాలను కేంద్ర ఎయిర్ పోర్టు అధికారులు పరిశీలించారు. ఆరు ఎయిర్ పోర్టుల నిర్మాణానికి కేంద్రం ప్రతిపాదనలు చేస్తోందని, దీనిలో భాగంగానే శ్రీకాకుళం జిల్లా పలాస రెవెన్యూ డివిజన్లోని మందస, వజ్రపుకొత్తూరులలో విమానాశ్రయం నిర్మించడానికి సన్నహాలు చేస్తున్నారు. పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్నాయుడు చొరవతో ఈ ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. జిల్లాలోని సంతబొమ్మాళి మండలంలో గల మూలపేట పోర్టుకు అనుసంధానంగా వాణిజ్యపరమైన ఎగుమతులు, దిగుమతులకు ఎయిర్‌పోర్టు ఉపయోగపడనుందని అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గల ఫీజిబులిటీని నిపుణులు, అధికారులు పరిశీలిస్తున్నారు. సుమారు 1383 ఎకరాలు ఈ నిర్మాణానికి అధికారులు సేకరిస్తున్నారు. దీనిలో భాగంగానే కేంద్ర బృందం, ఆర్డీవో జి.వెంకటేశ్వరరావు, మందస తహసీల్దార్ హైమావతి, సర్వేయర్ బొడ్డపాటి బాబూరావు, తెలుగు దేశం పార్టీ నాయకులు, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



# మత్స్యకారులపై పాలకుల నిర్లక్ష్యం తగదు

**సోంపేట, నవంబర్ 21(వార్త):** సముద్ర గర్భంలో ఉన్న అపార మత్స్య సంపదను వెలికితీసి, ప్రపంచ దేశాల ప్రజలకు పౌష్టికాహారం అందించడంలో మత్స్యకారుల సేవలు ప్రశంసనీయమని అఖిల భారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్, సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి అన్నారు. అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం ఆమె సోంపేట మండలం బారువ, కొత్తూరు బీసీ మత్స్యకార సంఘం నాయకులకు, మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్సకారుల సంక్షేమం, మత్స్య అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయిస్తున్నా, అవి వారికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 970 కిలోమీటర్ల సువిశాలమైన సాగరతీరం ఉన్నా, మౌలిక సదుపాయాల కొరతతో మత్స సంపద వెలికితీతలో వెనకపడుతున్నారన్నారు. మేధావులుగా దేశానికి సేవలందించాల్సిన బాలలు చేపల వేటకు పరిమితం కావడం దిగ్భ్రాంతికరమన్నారు.

మత్స్య సాంకేతిక విద్య, సైనిక శిక్షణపరమైన విద్యను వారికి చేరువ చేయడానికి తీర ప్రాంతాల్లో విద్య సంస్థలను ఏర్పాటు చేసే ప్రతిపాదనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిశితంగా పరిశీలించాలని ఆమె కోరారు. మర పడవలు, వలలు, ఇతర పరికరాల కొనుగోలుకు బ్యాంకులు ఇచ్చే రుణాలు, సబ్సిడీలపై మత్స్యకారులకు అవగాహన కల్పించడానికి కోఆర్డినేటర్ల ఏర్పాటు అవసరమని ఆమె గుర్తు చేసారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మత్స్యకారులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు అమర లోకనా థం, పోలయ్య, గోరక ఢిల్లీరావు, జానకిరావు తదితర బీసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



# ఎలుగుబంట్లను రెచ్చగొట్టవద్దు

**మందస, నవంబర్ 21(వార్త):** ఉద్దానంలో ఎలుగుబంట్ల సంచారం ఉందని, వాటిని రెచ్చగొట్టే చర్యలను ప్రజలు చేయవద్దని అటవీ శాఖాధికారులు కోరారు. ఈ మేరకు ఉద్దానంలోని రాంపురం పంచాయతీలోని బిడిమి, వజ్రపుకొత్తూరుల్లో గురువారం వారు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్ల ఎలుగుబంట్లు మరీ ప్రమాదకరమన్నారు. ఎలుగుబంట్ల నుంచి రక్షించుకునే విధానాన్ని వివరించారు. కవ్వింపుచర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. ఎలుగుబంట్ల సంచారం ఎక్కువగా ఉంటే, అటవీశాఖాధికారులు తెలియజేయాలని కోరారు. కాశీబుగ్గ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎఫ్ఎస్‌వో బి.రామకృష్ణ, రాఘవయ్య, ఎం.పోలయ్య, ఆర్.సంతోష్‌కుమార్, తిరుపతిరావు, ఆయా గ్రామాల నాయకులు పాపారావు, భీమారావు, వీఎస్ఎస్ అధ్యక్షుడు దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో భగవాన్ ప్రతిభ



**ఇచ్ఛాపురం, నవంబర్ 21(వార్త):** జాతీయస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ ఇచ్ఛాపురం విద్యార్థి నీలాపు భగవాన్ కాంస్య పతకం సాధించారు. ఈ సంద ర్భంగా ఆయనకు స్థానిక తైక్వాండో క్లాస్ ఆవరణలో గురువారం అభినం దన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి హాజరయ్యారు. భగ వాన్, జాతీయస్థాయి పోటీలకు వెళ్లిన నలుగురు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. పిలక విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్స్ ప్రేమ్ కుమార్, కాళ్ల దిలీప్, చాట్ల తిరుపతి, డాక్టర్ వెచ్చ సంతోష్, బత్తిన కృష్ణయ్య, చిన్నారి మధు, వల్లం పటి శ్రీరామ్,శాసనపురి ప్రదీప్, రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్ సుమన్ రెడ్డి, హై స్కూల్ ఉపాధ్యాయులు నందికి జోగేష్, హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఆసిలత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సొండి కులస్తులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**ఇచ్ఛాపురం, నవంబర్ 21(వార్త):** సొండి కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రెడ్డిక సాధికారిక చైర్మన్ కొండ శంకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన అమరావతిలో విప్ అశోక్‌కి వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు ఓబీసీ జాబితాలోకి సొండిలను చేర్చాలని కోరారు. కుల వృత్తి కోల్పోవడంతో ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట రత్నాల రామారావు, మొగిలిపురి నరేంద్ర సింహాద్రి ప్రసాద్ ఆచారి ఉన్నారు.



# స్వర్ణోత్సవం స్ఫూర్తిదాయకంగా ఉండాలి



**మందస, నవంబర్ 21(వార్త):** యూటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా స్వర్ణోత్సవ మహాసభల గోడ పత్రికలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహలే లక్ష్యంగా ఉపాధ్యాయులకు, విద్యా రంగానికి సేవలందిస్తున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు ఉపాధ్యాయులను చైతన్య పరచడంతో పాటు విద్యా రంగ అభివృద్ధికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖా మాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా అధికారులతో పాటు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు హాజరవుతున్న మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు జగదీష్ బడిత్య, ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బీఎస్ పురం ప్రధానోపాధ్యాయులు ఎ.తులసీరావు, పీజీటీలు మార్పు చక్రధర్ రావు, గున్న రమణబాబు, యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లు కొర్ల సోమేశ్వరరావు, కాసం శ్రీనివాసరావు, లండ రాజారావు , జన్ని సోమేశ్వరరావు, గున్న రాజు, దూగాన మాధవరావు, యూటీఎఫ్ సీనియర్ కార్యకర్తలు మజ్జి రంగారావు, సీపాన అమ్మినాయుడు, గున్న చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోండ్రుకు రుణపడి ఉంటా



**వంగర, నవంబర్ 21(వార్త):** రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తన నియామకానికి కృషి చేసిన రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్‌కు రుణపడి ఉంటానని బలిజిరెడ్డి శ్రీను తెలిపారు. గురువారం ఆయన కార్పొరేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి అమరావతి వెళ్లారు. తొలుత అక్కడ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ను కలిసి తనను గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 30 ఏళ్ల నుంచి కొప్పుల వెలమ సంఘం నాయకులుగా ఇటు తెలుగుదేశం పార్టీకి అటు సంఘానికి ఎన్నో సేవలు అందించానని, తన అంకితభావాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్, మురళీమోహన్ గుర్తించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో వంగర మండల టీడీపీ అధ్య క్షులు పిన్నింటి మోహనరావు, సీనియర్ నేత లచ్చుభుక్త కృష్ణమూర్తి, పటువర్ధనం సర్పంచ్ ప్రతినిధి నల్ల మురళీనాయుడు, భాగెమ్మ పేట గ్రామ మాజీ సర్పంచ్ రెడ్డి గోపాల్‌నాయుడు, రాజాం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మజ్జి గణపతి, వంగర మండల తెలుగు యువత అధ్యక్షుడు బెజ్జిపురం రవి, రాజాం నియోజకవర్గానికి కొప్పుల వెలమ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సంగమేశ్వరునికి పూజలు



**వంగర, నవంబర్ 21(వార్త):** సంగాం సంగమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆలయ అర్చకులు సిద్ధాంతం రమేష్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు తొలుత త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించి శివునికి ఇష్టమైన, ప్రీతికరమైన ప్రసాదాలను పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి ప్రసాదాలను స్వీకరించారు.

## 'దాసరి' ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు

**మందస, నవంబర్ 21(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లొహరిబంద పంచాయతీ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ అధికార ప్రతినిధి దాసరి తాతారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ఎక్కువ సంఖ్యలో కార్యకర్తలను సభ్యులుగా చేర్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని తీసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఓ యజ్ఞంలా చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్తు దివాకర్, అప్పారావు, దాసరి సుధాకర్, వైకుంఠరావు,పెద్దిని తిరుపతి, ఈశ్వరరావు, ముడిమించి అజయ్, నర్తు మహలక్ష్మి, పిట్ట హిమవతి, నాగవేణి, మామిడి తేజమ్మ తదితరులు పాల్గొన్నారు.






## 'విద్యార్థులకు డేట్ ఆఫ్ బర్త్ తప్పనిసరి'

**జలుమూరు, నవంబర్ 21(వార్త):** డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్ లేని విద్యార్థులను చల్లవానిపేట ఆధార్ సెంటర్‌కు విద్యార్థులను పంపించినట్లు ఎంఈవో మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపార్ నమోదు నిమిత్తం డేట్ ఆఫ్ బర్త్ అవసరమని తెలిపారు.

## చల్లవానిపేట హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించండి



**జలుమూరు, నవంబర్ 21(వార్త):** చల్లవానిపేట జిల్లా పరిషత్ హై స్కూల్‌కు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. 100కు పైగా విద్యార్థులు ఉన్న ఈ హైస్కూలు పాతపట్నం-నరసన్నపేట ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో ఆందోళన చెందుతున్నామన్నారు. పాఠశాల విడిచిపెట్టే సమయంలో బయటకు రావాలన్నా.. వాహన రద్దీతో ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బోధనా సామర్థ్యాలు పెంచాలి



**నరసన్నపేట, నవంబర్ 21(వార్త):** స్కూల్ కాంప్లెక్సు బోధనా సామర్థ్యాలు పెంచేలా ఉండాలని ఎంఈవో శాంతారావు తెలిపారు. గురువారం ఆయన ఉర్లాం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్ సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ ప్రస్తుత పరిజ్ఞానానికి అనుగుణంగా బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం హర్షవర్దన్, సీఆర్ఎంటీ గిరిధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పశువులను తరలిస్తున్న బొలేరో స్వాధీనం

**జలుమూరు, నవంబర్ 21(వార్త):** పశువులను అక్రమంగా తరలిస్తున్న బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి తిలారు నుంచి జగ్గంపేటకు మూడు ఆవులు, ఒక దూడను బొలేరో వాహనంలో తరలిస్తుండగా మడపాం టోల్‌గేట్ వద్ద పట్టుకున్నామన్నారు. వాహనాన్ని నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామని తెలిపారు. డ్రైవర్ పోసిన నాగేంద్రను అదుపులోకి తీసుకున్నామన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## తీరంలో సాగర్ కవచ్

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 21 (వార్త):** సాగర్ కవచ్ కింద మెరైన్ పోలీసులు జిల్లావ్యాప్తంగా తీర ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు చేస్తున్నారు. తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారు. సముద్ర మార్గం గుండా ఎవరైనా అపరిచితులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే తీర ప్రాంత గ్రామాలకు వచ్చే బస్సులు, ప్రైవేట్ వాహనాలను క్షుణ్నంగా పరిశీలించారు. కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఎస్ఐలు, హెచ్‌సీలు, పోలీసులు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు.

## సిక్కోలు విద్యార్థినులకు
# 'ఉమెన్ ఇన్ ఏవియేషన్' పురస్కారాలు

*** ఢిల్లీలో అందజేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఉమ్లున్మాంగ్ ఉల్నామ్**

*** అభినందనలు తెలియజేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

**శ్రీకాకుళం, నవంబర్ 21 (వార్త):** జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థినులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. విమానయాన రంగంలో మహిళలను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 18న నిర్వహించిన ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా వ్యాసరచన పోటీలో పాల్గొని, తమ ప్రతిభను నిరూపించు కున్నారు. దాదాపు వివిధ డిగ్రీ కళాశాల లకు చెందిన 150 మంది విద్యార్థినులు హాజరు కాగా, తుది దశకు ఆరుగురిని ఎంపిక చేశారు. వీరంతా ఈనెల 20న రాత్రి శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం , అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి చేరుకున్నారు. అక్కడి ఏరో సిటీలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరందరికీ కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఉమ్లున్మాంగ్ ఉల్నామ్, ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా అధ్యక్షురాలు రాధా భాటియా, ఏవియేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ విపిన్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విమానయాన శాఖ కార్యదర్శి మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది విద్యార్థినులు విజేతలుగా నిలవగా.. కేవలం శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారే ఆరుగురు ఉండటం అభినందనీయమన్నారు.




విమానయాన రంగంలో మహిళలను మరింతగా ప్రోత్సాహించాలనే కేంద్ర మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆకాంక్షలకు ఇదే నిదర్శనమన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడంపై పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వీడియో సందేశం విడుదల చేశారు. బహుమతులు పొందిన విద్యార్థినులు యర్రా అఖిల, ఆరిక అనిత, జె.గంగోత్రి, యేల్తూరు జ్యోత్స్న, పి.నాగమణి, పి.సుశీలకు అభినందనలు తెలియజేశారు. ఉన్నతంగా రాణించాలనే బాలికల కలలకు రెక్కలిద్దామని పిలుపునిచ్చారు. ప్రతి అమ్మాయినీ ఉన్నత చదువులు చదివించాలని, తమదైన ఆసక్తి కలిగిన రంగంలో వారిని ప్రోత్సహించాలని కోరారు. భేటీ కా ఉడాన్.. దేశ్ కా స్వాభిమాన్ లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

# అధ్యక్షా.. డయాలసిస్ యూనిట్లు పెంచండి

*** కిడ్నీ సమస్యలపై శాసనమండలిలో మాట్లాడిన ఎమ్మెల్సీ నర్తు రామారావు * గడిచిన ఐదేళ్లలో వైసీపీ చేసిన పనులు వివరణ * కిడ్నీ సమస్యలపై దృష్టి సారించాలని ప్రభుత్వానికి వినతి**




**కవిటి, నవంబర్ 21 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మరణ మృదంగం మోగిస్తున్న కిడ్నీ సమస్యలపై స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు గురువారం కౌన్సిల్లో మాట్లాడారు. గత ప్రభుత్వం కిడ్నీ రోగుల కోసం చేసిన సేవలను తెలుపుతూ కొనసాగింపుగా ప్రస్తుత ప్రభుత్వం ఏమి చేస్తుందో వివరణ అడుగుతూ.. డయాలసిస్ కేంద్రాల సంఖ్యను పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలిలో ఆయన మాట్లాడిన తీరును పరిశీలిస్తే... 'శ్రీకాకుళం జిల్లాలోని కిడ్నీ వ్యాధులు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. ఈ కిడ్నీ వ్యాధులపై మొదటిగా మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం జగతి గ్రామానికి తీసుకువచ్చి సమావేశం ఏర్పాటు చేశాను అధ్యక్షా..!! ఆ కిడ్నీ బాధితులకు ఆరోజు జగనన్న ఇచ్చిన మాట ప్రకారం, పదివేల రూపాయల పింఛను అధికారంలోకి రాగానే ఇచ్చారు అధ్యక్షా.. తాగునీరు సమస్య వల్ల కిడ్నీ వ్యాధులు వ్యాపిస్తున్నాయని పరిశీలనలు చేసిన వైద్యులు చెబితే, దీనికోసం 700 కోట్ల రూపాయలు ఖర్చు చేసి, హిరమండలం నుంచి మా ఇచ్ఛాపురం వర్గానికి తాగునీరు తీసుకొచ్చాం అధ్యక్షా.. దీంతో పాటు పలాస నియోజకవర్గంలో 74 కోట్ల రూపాయలతో 200 బెడ్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ మా ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేశారు అధ్యక్షా.!! ప్రస్తుతం ఒక్కో డయాలసిస్ సెంటర్లో, ఒక బెడ్ మీద ఒక రోగికి బదులు ముగ్గురు రోగులు ఉంటున్న పరిస్థితి ఉంది . డయాలసిస్ యూనిట్లను పెంచే విధంగా ప్రభుత్వానికి మీ ద్వారా కోరుతున్నా అధ్యక్షా " అంటూ ఉద్దానం కిడ్నీ సమస్యలను శాసనమండలిలో ఎమ్మెల్సీ రామారావు ప్రస్తావించారు.




## న్యాయవాదులకు డైరీల పంపిణీ

**శ్రీకాకుళం లీగల్, నవంబర్ 21 (వార్త):** శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ బార్ అసోసియేషన్ హాల్లో 2025 నూతన సంవత్సర డైరీలను సీనియర్ న్యాయవాది కూన రాజారావు గురువారం న్యాయవాదులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది తర్లాడ రాధాకృష్ణ, స్టేట్ బార్ అసోసియేషన్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు రమణ, బైరి జగదీష్, పొన్నాడ వెంకటరమణ, కంచరాన నాగభూషణం, వాన కృష్ణ చంద్, బి. జయంతి, బైరి దామోదర్ రావు, తంగి చంద్రశేఖర రావు, తంగి శివప్రసాద రావు, ఎంఎస్‌విబి వినయ్ భూషణ్, పూర్వపు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్ని సూర్యారావు, జల్లు తిరుపతి రావు, బగాది రామ్మోహన్ రావు, అన్నెపు సత్య నారాయణ, కె.ప్రతాప్ చంద్ర, బెహరా తిరుమల రావు , జి.కృష్ణ ప్రసాద్, కొంక్యాన సుభాష్, దవల విజయలక్ష్మి, చిగులుపల్లి రామ్మోహన్ రావు, ఎ.కృష్ణం రాజు, ఎ.ఉమామహేశ్వర రావు, ఎన్‌వీ విజయకుమార్, అప్పారావు పట్నాయక్, ఎం అసదుల్లాతో పాటు జిల్లా బార్ అసోసియేషన్ కమిటీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

## నారాయణలో ట్రాఫిక్‌పై అవగాహన




**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 21 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని నారాయణ స్కూల్‌లో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు ఎస్ఐ ఎస్ఎస్ఎస్ దొర అవగాహన కల్పించారు. విద్యార్థులందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కలిగివుండాలన్నారు. 18 ఏళ్లలోపు వయస్సు గలవారు వాహనాలు నడపకూడదని సూచించారు. విద్యార్థులు బైక్‌లు నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం వల్ల ఎక్కువమంది ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. విద్యార్థులు స్కూళ్లకు సైకిళ్లపై వచ్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అశోక్‌పై విప్ పదవి పట్ల హర్షం

**ఇచ్ఛాపురం, నవంబర్ 21 (వార్త):** ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కి శాసన సభ ప్రభుత్వ విప్ పదవి లభించడం పట్ల 23వ వార్డు బెల్లుపడా కాలనీ తెలుగుదేశం పార్టీ నాయకులు శాసన శేఖర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి అమరావతి చేరుకుని శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు.



# విజేతలుగా తిరిగి రండి

*** జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ తిరుమల చైతన్య * నేటి నుంచి 68వ ఏపీ రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్ * 14 సాఫ్ట్ బాల్ పోటీలు* చిత్తూరు పయనమైన శ్రీకాకుళం జిల్లా జట్లు* జిల్లా జట్లకు వీడ్కోలు పలికిన స్కూల్ గేమ్స్ జిల్లా ప్రతినిధులు**



**శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబర్ 21(వార్త):** రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీల్లో తుది వరకు పోరాడి విజేతగా జిల్లాకు తిరిగి రావాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ డాక్టర్ ఎస్. తిరుమల చైతన్య ఆకాంక్షించారు. చిత్తూరు జిల్లా అరకొండ వేదిక ఈనెల 22 నుంచి 24 వరకు 68వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్-2024 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు గురువారం ఉదయం ఎక్కడి నుంచి పయనమై వెళ్లాయి. ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో క్రీడాకారులను ఉద్దేశించి ఎస్.జీ.ఎఫ్ జిల్లా సెక్రెటరీ బీవీ రమణ మాట్లాడుతూ గత పదేళ్లుగా జిల్లాలో సాఫ్ట్ బాల్ నుంచి వందల మంది రాష్ట్రస్థాయిలో, 70 మందికిపైగా జాతీయస్థాయిలో క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించి రాణిస్తుండడం ఎంతో శుభపరిణామమని కొనియాడారు. ఈ సీజన్ లో రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీల్లో పతకాల పంట పండిస్తున్నట్టు సంతోషం వ్యక్తం చేశారు. సాఫ్ట్ బాల్ క్రీడాకారులు కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించి రాష్ట్ర పోటీల్లో విజయదుందుబీ మోగించాలని ఆయన పిలుపునిచ్చారు.

### జిల్లాకు మెడల్ ఖాయం: ఎంవీ రమణ

జిల్లా పీడీ-పీఈటీ సంఘ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం, సమయస్ఫూర్తిని కనబరిచి రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీల్లో తుది వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలవడం ఖాయమని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా గేమ్ ప్లాన్ అమలు చేయాలని సూచించారు. కోచ్ మేనేజర్ల సూచనలను ఆటలో అమలుచేసి గెలుపుబాట పట్టాలని, టైటిళ్లతో జిల్లాకు తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిడి మెట్ట తిరుపతిరావు, క్రీడాకారుల తల్లిదండ్రులు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా జిల్లా జట్లకు కోచ్ మేనేజర్లుగా తోటారావు (పీడీ మాణిక్యపురం- ఇచ్ఛాపురం) సీనియర్ నేషనల్ ప్లేయర్స్/కోచ్లు ఐ.గౌరీశంకర్, పి.హరికృష్ణ క్రీడాకారుల వెంట చిత్తూరు పయనమై వెళ్లారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546